సాక్షి తిరుపతి

గురువారం : 12 డిసెంబర్ 2024



న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది

తమకు న్యాయ వ్యవస్థపై నమ్మకముందని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 8లో



బహుభాషా కోవిదులు కావాలి

విద్యార్థులు మాతృభాషను అభిమానిస్తూ, బహుభాషా కోవిదులుగా వెలుగొందాలని వీసీ సీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. - 8లో



అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మించాలి

తిరుమలలో కూల్చివేసిన అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మించాలని విజయ శంకరస్వామి డిమాండ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ఎస్వీయూలో ఓఆర్‌ఐ జర్నల్ ఆవిష్కరణ



ఓఆర్‌ఐ జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, డైరెక్టర్

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ ప్రచురించిన అంతర్జాతీయ జర్నల్‌ను వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఓఆర్‌ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లు బుధవారం వీసీ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి తలమానికంగా నిలిచిన ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్‌ఐ) మన ప్రాచీన వారసత్వ సంపదైన తాళపత్ర గ్రంథాల సంరక్షణకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎన్నో అపురూపమైన గ్రంథాలు ముద్రించిందని, ప్రస్తుతం జర్నల్ 64వ వాల్యూమ్‌ను ప్రచురించడం సంతోషకరమన్నారు. ఓఆర్‌ఐ ప్రచురించే జర్నల్‌లో సంస్కృతం, తెలుగు, ఆంగ్ల భాషల్లో వ్యాసాలు ఉండడం ప్రత్యేకతని, ఈ జర్నల్ దాదాపు 40 దేశాలకు ఎక్స్ఛేంజ్ రూపంలో వెళుతుందని తెలిపారు. టీటీడీ సహకారంతో సంస్థను మరింతగా అభివృద్ధి చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ పరిశోధన సిబ్బంది, పరిశోధకులు, నాన్ టీచింగ్ కార్యవర్గం పీకే సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 10 మంది డిబార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈనెల 4వ తేదీ నుంచి జరుగుతున్న డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న 10మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. హైపవర్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ఇచ్చిన వివరాల మేరకు తిరుపతి జోన్ పరిధిలో ముగ్గురు, చిత్తూరు జోన్ పరిధిలోని పరీక్ష కేంద్రాల్లో ఏడుగురు డిబార్ చేసినట్లు ప్రకటించారు.

పౌష్టికాహారంపై పరిశోధన సదస్సు



చిన్నారుల తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

తిరుపతి తుడా: రుయా, ఎస్వీ వైద్య కళాశాల చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో చిన్నపిల్లల పౌష్టికాహారంపై పరిశోధన సదస్సు నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ సదస్సును వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలకు పోషకాహారంలో మన చుట్టూ అందుబాటులో ఉన్న నాణ్యమైన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలను పొడి చేసి చిన్న పిల్లలకు ఆహారంగా అందించాలని సూచించారు. ఇందులో మంచి పోషక విలువలు కలిగిన విటమిన్లు పిల్లలకు అందుతాయన్నారు. అనంతరం పోషకాహర లోపంతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరీటి, డాక్టర్ సునీత, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రేఖ, నివేద పాల్గొన్నారు.

సప్తగంగ.. భక్తజనతరంగ!



పొన్నాలమ్మ

ఏడుగంగల జాతరతో జంగమయ్య క్షేత్రం పులకించిపోయింది. సప్తగంగల వైభవాన్ని చాటుతూ జరిగిన ఏడుగంగల జాతర ప్రాభవాన్ని చూసి తరించేందుకు తరలివచ్చిన అశేష భక్తులతో శ్రీకాళహస్తి జనసంద్రమైంది. అమ్మలారా.. మమ్ము చల్లంగా చూడమ్మా అంటూ కుల, మతాలకతీతంగా భక్తిశ్రద్ధలతో కొలిచారు. కొబ్బరికాయలు కొట్టి, పిండి దీపారాధన లు చేసి, ప్రసాదాలు నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి గంగమ్మలను నిమజ్జనం చేశారు. – శ్రీకాళహస్తి



అంకాళమ్మ



నల్లగంగమ్మ




కావమ్మ



ముత్యాలమ్మ



భువనేశ్వరి



అంకమ్మ

నీటి వనరులు.. ఓటి కుండలు

వరుస తుపాన్లు.. అల్పపీడనాలు.. జిల్లాలో సంవృద్ధిగా వర్షాలు.. పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు.. ఆ నీటితో కళకళలాడుతున్న చెరువులు.. సాగుపై అన్నదాతల ఆశలు.. అయినా బలహీన పడిన చెరువుల కట్టలు..మళ్లీ తుపాను సూచనలు.. ఆందోళనలో కర్షకులు.. ఏక్షణం ఏమి జరుగుతుందోనని అయోమయంలో రైతులు.. తక్షణమే చెరువు కట్టల మరమ్మతుకు విన్నపాలు.. ఇదీ జిల్లాలో నీటి వనరులు దుస్థితి. దీనిపై ప్రత్యేక కథనం.



శ్రీకాళహస్తి మండలం జంగాలపల్లిలో తెగిన చెరువుకట్ట

- నిండిన 70 శాతం చెరువులు
- బలహీనపడిన చెరువు కట్టలు
- మళ్లీ వర్షాలు వస్తే ప్రమాదమే?
- ఆందోళనలో అన్నదాతలు

వరదయ్యపాళెం/తిరుపతి అర్బన్: జిల్లాలో ఇప్పటికే 70 శాతం చెరువులు పూర్తిగా నిండిపోయాయి. కలుజులు పారుతున్నాయి. కేవలం 20 శాతం చెరువుల్లో 60 నుంచి 70 శాతం నీరు చేరాయి. మిగిలిన 10 శాతం చెరువుల్లో 40 నుంచి 50 శాతం నీళ్ల మాత్రమే ఉన్నాయి. అయితే అధిక శాతం చెరువుల కట్టలు బలహీన పడడంతో ప్రమాదపుటంచున ఉన్నాయి. ప్రస్తుతం బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మళ్లీ భారీ వర్షాలు కురిస్తే చెరువులకు గండ్లు పడి తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి పొంచి ఉంది.

ప్రమాదపుటంచుల్లో సంతవేలూరు చెరువు

సత్యవేడు నియోజకవర్గంలో చిన్ననీటి పారుదల జలాశయాల్లో సంతవేలూరు చెరువు అతిపెద్దది. 450 ఎకరాల విస్తీర్ణం, వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ చెరువు నిండుకుండలా మారింది. అయితే చెరువు కట్ట బలహీనంగా ఉండడంతో ఈ నీటి వనరు ప్రమాదపుటంచుల్లో ఊగిసలాడుతోంది. చెరువుకు గండిపడితే ఆయకట్టుతోపాటు 15 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. సగభాగం కట్ట మట్టి కరిగిపోవడంతో అక్కడక్కడా కట్ట కోతకు గురైంది. అంతేకాక చెరువుకట్ట లోపలి భాగంలో గతంలో ఏర్పాటు చేసిన రివిట్‌మెంట్ సైతం కుంగిపోయింది. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో సంతవేలూరు ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోసారి భారీ వర్షాలు పడితే చెరువుకు గండిపడే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వం స్పందించేనా?

సంతవేలూరు చెరువు దుస్థితిపై కూటమి ప్రభుత్వం స్పందిస్తుందో లేదోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సుమారు 2 కిలోమీటర్ల పొడవు ఉన్న చెరువుకట్ట అభివృద్ధితోపాటు చెరువు లోపలి భాగం పూర్తిగా రాతికట్టడంతో రివిట్‌మెంట్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు రూ.2 కోట్లకు పైగా నిధులు అవసరం అవుతాయని ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు.

కలెక్టర్ పరిశీలన

ఇటీవల కురిసిన వర్షాలకు సంతవేలూరు చెరువు నిండి, ప్రమాదపుటంచుల్లోకి చేరింది. వర్షాలు కురుస్తున్న సమయంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సైతం ఈ చెరువును సందర్శించి, బలహీనపడిన చెరువుకట్టను పరిశీలించారు. ఆ సమయంలో రైతులు ముక్తకంఠంగా చెరువు అభివృద్ధి చేయాలని వేడుకున్నారు.



ప్రమాదకరంగా ఉన్న సంతవేలూరు చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ (ఫైల్)

సంతవేలూరు చెరువు వివరాలు

చెరువు విస్తీర్ణం	450 ఎకరాలు
చెరువు పారుదల ఆయకట్టు	1000 ఎకరాలు పైగా
చెరువు కింద సాగు చేసే రైతుల సంఖ్య	300 పైగా

తిరుపతి జిల్లాలో ఇరిగేషన్ చెరువుల వివరాలు

డివిజన్ పేరు	చెరువుల సంఖ్య
తిరుపతి	660
వెంకటగిరి	256
గూడూరు	749
శ్రీకాళహస్తి	904
మొత్తం	2,569

ఇప్పటికే దెబ్బతిన్న చెరువులు

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి ఇరిగేషన్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో పలు చెరువులకు గండ్లు పడ్డాయి. శ్రీకాళహస్తి మండలం ఎంఎంసీ కండ్రిగ, జంగాలపల్లి, రామాపురం, సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం మండలంలోని సింగరాయపేట, మూర్తిపాళెం, పిచ్చాటూరు మండలంలోని తులసి కృష్ణాపురం, కేవీబీపురం మండలంలోని ఆరె చెరువులకు గండ్లు పడ్డాయి. కొన్నిచోట్ల మట్టి మూటలతో తాత్కాలికంగా రింగ్ బండ్ వేసినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు.



శ్రీకాళహస్తి మండలం రామాపురం చెరువుకు పడిన గండికి రింగ్ బండ్ వేస్తున్న రైతులు



నిండుకుండలా సంతవేలూరు చెరువు



పెళ్లకూరు మండలంలో కొత్తూరు చెరువుకు పడిన గండి(ఫైల్)



కోతకు గురైన సంతవేలూరు చెరువు కట్ట

సాగు ఇలా...

జిల్లాలో ఇప్పటికే అధికారికంగా 1.20 లక్షల ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. మరో 90 వేల ఎకరాల్లో వచ్చే జనవరి 10వ తేదీలోపు వరినాట్లు పూర్తి చేయనున్నారు. మరోవైపు వేరుశనగ, మినుములు, పెసర, కంది తదితర పంటలు 30 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇంకో 60 వేల ఎకరాల్లో మామిడి సాగు ఉంది. ఇతర ఉద్యాన పంటలు కూరగాయలు, నిమ్మ, జామ, పచ్చిమిరప, టమాట తదితర పంటలు 50 వేల ఎకరాల్లో సాగులో ఉంది. అనధికారికంగా మరో 70 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేసి ఉన్నారు. జిల్లాలో అనధికారికంగా మొత్తం 4.20 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు.

సాగుకు వనరులు ఎకరాల్లో ..

చెరువులు	2.50 లక్షలు
తెలుగుగంగ	80 వేలు
రిజర్వాయర్లు, ప్రాజెక్టులు	60 వేలు
బోర్లు	26 వేలు
గుంటలు, కాలువలు	4 వేలు

తక్షణమే చెరువుకట్ట అభివృద్ధి చేయాలి



ప్రమాదపుటంచుల్లో ఉన్న సంతవేలూరు చెరువు ను తక్షణమే అభివృద్ధి చేయాలి. బలహీనపడిన చెరువుకట్టకు మరమ్మతులు చేపట్టాలి. ఆ చెరువు ఆధారంగా వెయ్యి ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాం. తేడా వస్తే అందరూ నష్టపోతారు.
– రఘునాథరెడ్డి, రైతు, సంతవేలూరు

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం



సంతవేలూరు చెరువు అభివృద్ధి గురించి ఇటీవల చెరువు సందర్శనకు వచ్చిన తిరుపతి జిల్లా కలెక్టర్‌కు రైతులందరం ఫిర్యాదు చేశారు.ఏమాత్రం ఆలస్యం చేయకుండా రైతుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని రైతుల సాగునీటి అవసరాలకు ఎంతో ప్రాధాన్యమైన సంతవేలూరు చెరువు అభివృద్ధికి సహకరించాలి. – పాటి వెంకటేష్, రైతు, సంతవేలూరు

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం



వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న చెరువులు,ప్రమాదకర పరిస్థితుల్లోని చెరువుల వివరాలను సేకరించి, వాటి అభివృద్ధికి అంచనాలు సిద్ధం చేసి, నిధుల కోసం అధికారులకు నివేదిస్తున్నాం. సంతవేలూరు చెరువు అభివృద్ధికి తక్షణ సాయం కింద రూ.9 లక్షలు మంజూరు చేశాం. –మదనగోపాల్, జిల్లా ఇరిగేషన్ అధికారి

నూతన ఒరవడికి నాంది

- స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2024 ఫినాలే ప్రారంభం



హ్యాకథాన్‌లో పాల్గొన్న యువ ఆవిష్కర్తలు



ఫినాలే బృంద సభ్యులతో తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ రేణు దీక్షిత్

రేణిగుంట: 'సాంకేతిక, విద్యారంగాల్లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమం నూతన ఒరవడికి నాంది పలుకుతుంది. ఈ కార్యక్రమం ద్వారా నూతన ఆవిష్కరణలు రూపొందించి, భారత్‌ను ప్రపంచంలో అగ్రగామిగా నిలుపుదాం.' అని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఉన్న ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2024 ఫినాలే పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ఆయనతోపాటు ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రేణుదీక్షిత్ పాల్గొని, ప్రారంభోపన్యాసం చేశారు. దేశవ్యాప్తంగా 51 నోడల్ కేంద్రాల్లో జరుగుతున్న ఈ ఫినాలే పోటీల్లో మొత్తం 1,300 యువ ఆవిష్కర్తల బృందాలు వివిధ అంశాలపై నూతన ఆవిష్కరణలు, కోడ్ సొల్యూషన్ ప్రక్రియలు చేపడుతున్నాయన్నారు. ఏర్పేడు ఐఐటీ ప్రాంగణంలో జరిగే ఈ పోటీల్లో ఆరుగురు సభ్యులు, ఇద్దరు మెంటర్లతో కూడిన 21 జట్లు సాఫ్ట్‌వేర్ కోడ్ సొల్యూషన్, ఆయుష్ అంశాలపై కేంద్ర విద్యా, ఆయుష్ శాఖల ద్వారా అందించిన సవాళ్లకు కొత్త ఆవిష్కరణలు, కోడ్ సొల్యూషన్లపై నిరంతరాయంగా 36 గంటల మేధోమదనాన్ని ప్రారంభించాయి. ఉదయం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా దేశవ్యాప్తంగా ఫినాలే మారథాన్‌ను ప్రారంభించారు.

దశాబ్దకాలంలో విప్లవాత్మక మార్పులు

దశాబ్దకాలంగా దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయని భారత ప్రధాని నరేంద్రమోడీ యువ ఆవిష్కర్తలకు తెలిపారు. సాయంత్రం ఆయన 51 నోడల్ కేంద్రాల్లో పోటీల్లో పాల్గొన్న వారితో వర్చువల్‌గా మాట్లాడారు. 2017లో జరిగిన హ్యాకథాన్ కార్యక్రమంలో 7వేల నూతన ఆవిష్కరణలు రూపొందించగా, ప్రస్తుతం 57వేల ఆవిష్కరణలు జరిగి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచదేశాలకు దిక్సూచిగా నిలిచామన్నారు.

మహత్తర కార్యక్రమం

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమం ఎంతో మహత్తర కార్యక్రమం. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్ల, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుంది. కోడ్ స్లేయర్స్ జట్టు ఆరుగురు సభ్యులతో సమస్య సాధనకు 36 గంటల పాటు కృషి చేయడం సరికొత్త అనుభూతి. – భవేష్ నితిన్, ఇంజినీరింగ్ విద్యార్థి, ఎన్‌బీఎన్‌ఎస్‌టీఐ, పూణే

కొత్త అనుభూతి

మాది తెలంగాణ రాష్ట్రం కరీంనగర్. స్మార్ట్ ఇండియా స్థాపనకు భారత ప్రభుత్వం ఇలాంటి ఈవెంట్లను నిర్వహించడం, ఫినాలే పోటీల్లో పాల్గొనడం నాకు కొత్త అనుభూతినిచ్చింది. సాఫ్ట్‌వేర్ కాంక్వెరోర్స్ అంశంపై ఇచ్చిన కోడింగ్ ప్రక్రియను మేము ఆరుగురు సభ్యులం కలసి టీమ్ లీడర్‌గా హ్యా కథాన్ ఫినాలేలో ఉత్తమ అవుట్‌పుట్ రావటానికి కృషి చేస్తున్నాం.
–ఓ.వైష్ణవ్, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల, కరీంనగర్

సమృద్ధిగా అవకాశాలు

ప్రతి రంగంలోనూ విభిన్న ఆలోచనలతో అందరిని ఆకర్షించే రీతిలో కొత్త కొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చినప్పుడే రాణించగలుగుతాం. ఇందుకోసం భారత ప్రభుత్వం యువ ఇంజినీర్లకు అవకాశాలను సమృద్ధిగా కల్పిస్తోంది. అందులో భాగంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమం మా మేథో సంపత్తి ప్రదర్శనకు గొప్ప వేదికగా నిలిచింది. ఇక్కడకు వచ్చిన అందరూ పోటీపడి వారికిచ్చిన అంశాల్లో అత్యుత్తమ ఫలితాల సాధన దిశగా కృషి జరుగుతోంది.
– సోనియా, టీమ్ కోడ్ క్రాఫ్ట్స్, ఛత్తీస్‌ఘడ్

క్లుప్తంగా

అనర్హుల గుర్తింపునకే సర్వే

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్: అనర్హులైన పింఛన్ లబ్ధిదారులను గుర్తించడానికి జిల్లాలోని రేణిగుంట మండలం సూరప్పకశం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, సర్వే చేశామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభనబాబు తెలిపారు. బుధవారం సాక్షి దిన పత్రికలో 'కోతకు పచ్చ జెండా' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై డీఆర్‌డీఏ పీడీ స్పందించి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పింఛన్లు తీసుకుంటున్న వారిలో అనర్హులు ఉన్నారంటూ ఫిర్యాదులు రావడంతోనే సెర్ప్ సంస్థ వారు రాష్ట్ర స్థాయిలో ప్రతి జిల్లాలో ఓ గ్రామం లేదా ఓ వార్డును ఎంపిక చేసి, పింఛన్ల అర్హతపై సర్వే చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలో సూరప్పకశం గ్రామానికి ఎంపిక చేసుకుని, ఈ నెల 9, 10 తేదీల్లో తొమ్మిది బృందాల ఆధ్వర్యంలో పరిశీలన చేశామని వెల్లడించారు. ఒక్కొక్క బృందంలో ఓ మండల అధికారితో పాటు ఓ సచివాలయ ఉద్యోగిని చేర్చి, సర్వే పూర్తి చేశామని చెప్పారు. ఈ క్రమంలో సూరప్పకశం గ్రామంలో 354 పింఛన్లకు సంబంధించి నిర్వహించిన సర్వేలో 17 మంది అనర్హులుగా గుర్తించారని చెప్పారు. వారి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండడం, కారు కలిగి ఉండడం, వయస్సులో తేడాలుండడంతో 17 మంది అనర్హులుగా నిర్ణయించామని తెలిపారు. అంతేకాకుండా మరో 8 మంది గ్రామంలో లేరని తేలిందన్నారు. పింఛన్ల అర్హతకు సంబంధించిన రూల్స్ ఎప్పటి నుంచో ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు ఈ ఏడాది నవంబర్ ఒకటి నుంచి పింఛన్ తీసుకుంటూ మృతి చెంది ఉంటే స్పౌజ్ పెన్షన్‌లో భాగంగా వారి భార్యకు పింఛన్ ఇచ్చే అవకాశం కల్పిస్తామన్నారు. అయితే ఈ ఏడాది నవంబర్ 1కి ముందు మృతి చెంది ఉంటే వారికి అవకాశం కల్పించడంపై ప్రభుత్వం నుంచి ఇంకా ఉత్తర్వులు రాలేదన్నారు.

ఎర్రచందనం గోడౌన్ల పరిశీలన

తిరుపతి మంగళం: కర్ణాటక రాష్ట్రం దార్వాడలోని కర్ణాటక ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఫారెస్ట్ రేంజ్ అధికారుల(ఎఫ్ఆర్వోలు) బృందం బుధవారం తిరుపతిలో పర్యటించింది. ఈ సందర్భంగా సుమారు 30 మంది ఎఫ్ఆర్వోలు కేంద్రీయ ఎర్రచందనం గోడౌన్లు పరిశీలించారు. అనంతరం అలిపిరిలోని అటవీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎర్రచందనం వృక్షాలను పరిశీలించారు. తిరుపతి అటవీ అధికారులు వారికి అటవీ శాఖ విధులు, శేషాచలం అడవుల ప్రత్యేకతలను వివరించారు.

ప్రభుత్వ బోర్డులు కిందకి.. అక్రమ సాగు పైకి!

- ఆక్రమిత శోత్రియ భూముల్లో యథేచ్ఛగా సాగు
- దుక్కి దున్నే సమయంలో రెవెన్యూ అధికారుల హడావుడి
- ఆక్రమణల నియంత్రణ కలే!
- కబ్జాదారులు పంట సాగు చేస్తున్నా పట్టించుకోని వైనం


ఆక్రమిత శోత్రియ భూముల్లో దర్జాగా సాగు చేసిన ఉద్ది పంట (ఇన్‌సెట్) శోత్రియ భూముల్లో హెచ్చరిక బోర్డు ఉన్నప్పటికీ సాగులో ఉన్న పంట

వరదయ్యపాళెం: మండలంలోని శోత్రియ భూముల్లో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆక్రమణలు జరిగిన సమయంలో ఇది ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక బోర్డులతో రెవెన్యూ అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప పూర్తి స్థాయిలో నియంత్రించలేకపోతున్నారు. హెచ్చరిక బోర్డులు నామమాత్రంగా మారగా.. అక్రమంగా సాగు చేసిన పంట మాత్రం ఏపుగా పెరుగుతోంది. అయితే ఈ పరిణామాలన్నీ స్థానిక రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. నిరుపేదలకు సెంటు భూమిలో తలదాచుకునేందుకు చిన్నపాటి గూడు ఏర్పాటు చేసుకుంటే దాన్ని కూలదోసేంత వరకు హడావుడి చేసే రెవెన్యూ అధికారులకు చిన్న పాండూరు సమీపంలోని పాదిరికుప్పం రెవెన్యూలోని శోత్రియ భూముల్లో సత్యవేడు–చిన్న పాండూరు ప్రధాన రహదారికి ఆనుకుని వందలాది ఎకరాలు ఆక్రమణలకు గురై దర్జాగా పంటలు సాగు చేస్తున్న కళ్లకు గంతలు కట్టుకుని తమకేమీ తెలియనట్లుగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

అంతా హడావుడే

నెలరోజుల క్రితం రాత్రికి రాత్రే 10 ట్రాక్టర్లతో అక్రమంగా శోత్రియ భూముల్లో దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. ఆ సమయంలో స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు తహసీల్దార్ ఆక్రమిత శోత్రియ భూముల వద్దకు వెళ్లి దుక్కి దున్నుతున్న ఒక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆక్రమణదారులను హెచ్చరిస్తూ సంబంధిత భూమిలో హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అదంతా రెండు రోజుల హడావుడికే పరిమితమైంది. ఇదే అదునుగా ఆక్రమణదారులు దర్జాగా పంటలను సాగు చేయడం ప్రారంభించారు. ఇదంతా మారుమూల ప్రాంతంలో మాత్రం కాదు. సత్యవేడు–చిన్న పాండూరు ప్రధాన రహదారికి ఆనుకుని ఈ ఆక్రమణల పర్వం కొనసాగుతోంది.

ఎందుకో మౌనం?

శోత్రియ భూముల్లో దర్జాగా ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నప్పటికీ నియంత్రించాల్సిన అధికారులు మాత్రం మౌనముద్రలో ఉన్నారు. అక్రమార్కుల వెనుక ఎవరు ఉన్నారు? వారి నుంచి ఒత్తిళ్లు ఉన్నాయా? లేక పెద్ద మొత్తంలో ముడుపులు అందుకున్నారా? అన్న కోణంలో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందిస్తే గానీ ఆక్రమణల పర్వం కొలిక్కి వచ్చే పరిస్థితి లేదు.

చర్యలు తీసుకుంటాం

శోత్రియ భూముల్లో పంటల సాగు చేస్తున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. గతంలో దున్నకాలు గురించి తన దృష్టికి వచ్చిన సమయంలో రాత్రివేళల్లోనే వెళ్లి ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నాం. సంబంధిత ఆక్రమిత భూముల్లో బోర్డులు పాతి హెచ్చరించాం. తదుపరి పంటల సాగు విషయం తన దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
–రాజశేఖర్, తహసీల్దార్, వరదయ్యపాళెం మండలం

న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: తమకు న్యాయ వ్యవస్థపై నమ్మకముందని, అదే నేడు రుజువైందని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వాకాడులోని ఆయన నివాసంలో బుధవారం వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కక్ష సాధింపు చర్యలకు పూనుకుందని అన్నారు. ఇందులో భాగంగా సోషల్ మీడియా యాక్టివిస్టులపై పెడుతోందని, ఈ అక్రమ కేసుల విషయంలో న్యాయ స్థానంలోనే తేల్చుకునేందుకు సిద్ధమయ్యామన్నారు. సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెట్టినా వెంటనే సంబంధిత వ్యక్తులను అక్రమంగా అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలోనే సైదాపురం మండలం చాగణం గ్రామానికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ చిరంజీవిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి, గుర్తు తెలియని వ్యక్తుల్లా, నంబర్ ప్లేటు లేని కారులో తరలించారని అన్నారు. దీనిపై పార్టీ క్యాడర్ అప్రమత్తంగా వ్యవహరించి, పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. అయితే ఒక వ్యక్తిని అరెస్టు చేసే సమయంలో 41ఏ నోటీలు ఇచ్చి స్టేషన్‌కు తీసుకుని వెళ్లాల్సి ఉండగా అలాంటిది రాష్ట్రంలో ఎక్కడా అమలు చేయడం లేదని విమర్శించారు. చిరంజీవిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా కోర్టు రిమాండ్‌కు పంపే అంత పెద్ద కేసు కాదని, స్టేషన బెయిల్ ఇచ్చి పంపించ వచ్చని చెప్పిందన్నారు. నిజం ఎప్పుడు నిలకడ మీద తెలుస్తుందనేందుకు ఇది ఉదాహరణగా నిలుస్తుందని చెప్పారు. ఈ కేసులో పార్టీలోని లీగల్ సెల్ తోపాటు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేశారని, దీంతో కార్యకర్తలకు కూడా భరోసా దక్కిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్ని అబద్ధాలు చెప్పిందనేందుకు ఒక్క పథకం కూడా అమలు చేయక పోవడమే నిదర్శనమని అన్నారు. పేద విద్యార్థులు, రైతులు నేడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయన వెంట సైదాపురం మండల నాయకులు ఉన్నారు.

అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మించాలి


సభలో ప్రసంగిస్తున్న విజయ శంకరస్వామి

తిరుపతి సిటీ: తిరుమలలో కూల్చివేసిన అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మించాలని, అన్నమయ్య, హనుమంతుని విగ్రహాలను ఏర్పాటు చేయాలని అన్నమయ్య జానపద కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మంగళం బీటీఆర్ కాలనీలోని అన్నమయ్య కళాక్షేత్రం నుంచి టీటీడీ పరిపాలన భవనం వద్దకు వందలాది మంది కళాకారులు, శ్రీవారి భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ పరిపాలనా భవనం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తిరుమలలో హరినామ సంకీర్తన కోసం నమోదు చేసుకున్న 7 వేల బృందాలకు అవకాశం కల్పించాలన్నారు. శ్రీవారి గొప్పతనాన్ని అన్నమయ్య తమ కీర్తనల ద్వారా దేశం సరిహద్దులు దాటించి, వ్యాపింప చేశారన్నారు. అన్నమయ్య ప్రాచుర్యాన్ని తగ్గించడానికి 2003లో తిరుమలలో అన్నమయ్య గృహాన్ని కూల్చివేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏమి పాపం చేశారని అన్నమయ్య, హనుమంతుని విగ్రహాలు తొలగించారని ప్రశ్నించారు. అన్నమయ్య, హనుమంతుని విగ్రహాలను పునఃప్రతిష్ట చేయాలని టీటీడీ యాజమాన్యాన్ని కోరితే ఇంతవరకు అతీ, గతిలేదన్నారు. భజన కళాకారులు తిరుమలలో హరినామ సంకీర్తన కోసం 7 వేల బృందాలు దరఖాస్తు చేసుకున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. జానపద గురువులకు గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని టీటీడీ యాజమాన్యాన్ని కోరారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా హరినామ సంకీర్తన కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. డిమాండ్‌లు పరిష్కరించకపోతే ఫిబ్రవరి 22వ తేదీ నుంచి ఉపవాస హరినామ సంకీర్తన నిరసన కార్యక్రమాన్ని పరిపాలన భవనం వద్ద చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఈ మేరకు జేఈఓ వీరబ్రహ్మానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్రం కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బంగారు మురళి, రాష్ట్ర కోశాధికారి దేవానంద్, జై భారత్ జాతీయ కార్యదర్శి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

భూములకు పరిహారం ఇప్పించండి

- ఎమ్మెల్యేకు వికృతిమాల రైతుల మొర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్

రేణిగుంట(ఏర్పేడు): తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ పనుల కోసం గతంలో ప్రభుత్వం తీసుకున్న భూములకు ఇప్పటివరకు తమకు పరిహారం ఇవ్వలేదని, పరిహారం ఇప్పించాలని వికృతమాల రైతులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి విన్నవించారు. మండలంలోని వికృతమాలలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. గ్రామస్తులు మాట్లాడుతూ 52 మంది రైతులు విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చామని, ఇప్పటివరకు తమకు ఎలాంటి పరిహారం అందలేదని, పరిహారం త్వరగా ఇప్పించేందుకు కృషి చేయాలని ఆయనకు మొరపెట్టుకున్నారు. అలాగే పరిశ్రమల స్థాపనకు ఏర్పాటు చేసిన ఈఎంసీకి 18 మంది రైతులు తమ భూములు ఇవ్వగా వాటికి కూడా పరిహారం అందలేదని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. పలువురు ఇతర సమస్యలకు సంబంధించి వినతిపత్రాలను అందజేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిహారం పెండింగ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ భార్గవి, డీటీ రోజారమణి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధనంజయులునాయుడు, మోహన్ రావు, పేరం నాగరాజనాయుడు, పూల హేమాక్షి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

మండలంలోని వెంకటాపురం పంచాయతీ ఆర్.అగ్రహారంలో తహసీల్దార్ సురేష్‌బాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం ఐదు వినతులు వచ్చాయి.

రోడ్డు ప్రమాద మృతుడు నాగలింగంగా గుర్తింపు

నారాయణవనం : రోడ్డు ప్రమాదంలో మంగళవారం రాత్రి దుర్మరణం చెందిన వ్యక్తి మృతదేహాన్ని పుత్తూరుకు చెందిన నాగలింగం(34)గా పోలీసులు గుర్తించారు. నారాయణవనంలోని జాతీయ రహదారి బైపాస్ వద్ద ఆపి ఉంచిన లారీని ఢీ కొన్న ఘటనలో మృతి చెందిన విషయం విదితమే. పోలీసుల కథనం మేరకు..కడప జిల్లా నుంచి చెన్నై హార్బర్‌కు ముడి ఖనిజాన్ని తీసుకెళుతున్న లారీ మంగళవారం మధ్యాహ్నం నారాయణవనంలోని జాతీయ రహదారి బైపాస్ వద్ద ఆగిపోయింది. అయితే లారీకి ఇండికేటర్లను ఏర్పాటు చేయక పోవడంతో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పుత్తూరు నుంచి మండలంలోని కీళగరం గ్రామానికి బైక్‌పై వెళుతున్న నాగలింగం చీకటిలో వాహనం కనిపించకపోవడంతో లారీని ఢీ కొట్టాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం విచారణ చేపట్టిన పోలీసులు పుత్తూరుకు చెందిన నాగలింగంగా గుర్తించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.





ముగిసిన వైద్య అధ్యాపకుల శిక్షణ


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, అధ్యాపకులు


తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో ఈనెల 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగిన వైద్య అధ్యాపకుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖర్ పాల్గొని, ప్రసంగించారు. నిరంతర వైద్యవిద్య పరీక్ష విధానాల్లో సమూల మార్పులు జరిగాయన్నారు. నూతన విధానాలపై అధ్యాపకులు అవగాహన పెంచుకుని బోధన పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. నూతన వ్యాధులపై విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ డీఎస్ఎస్ మూర్తి, డాక్టర్ వెంకటేశ్వర్లు, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి, పర్యవేక్షణాధికారి డాక్టర్ రమ్య, వైద్యులు కిరీటి, ప్రతిభాస్రవంతి, ఉమా దేవి, డాక్టర్ ఎస్ సునీత, డాక్టర్ వి ఋషీంద్ర కుమారి, డాక్టర్ రమాదేవి పాల్గొన్నారు.

బహుభాషా కోవిదులు కావాలి


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి సిటీ: విద్యార్థులు మాతృ భాషను అభిమానిస్తూ, బహుభాషా కోవిదులుగా వెలుగొందాలని వీసీ సీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. బుధవారం ఎస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో భారతీయభాషోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి, అతిథులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశంలో అనేక భాషలు ఉన్నప్పటికీ తెలుగు భాష తీయనైనదని, విదేశీయులు తెలుగును ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని కొనియాడారని గుర్తు చేశారు. అనంతరం రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ ప్రతి తెలుగువాడు తెలుగును అభిమానించాలి, తెలుగు భాషతో పాటు ఇతర భాషల్లో కూడా ప్రవేశం కలిగి ఉండాలని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వయోలిన్, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డీన్ మురళీధర్, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఇంజినీర్ తాండవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మిరాశీదారుడు కన్నుమూత


కళత్తూరు వసుదేవాచార్య (ఫైల్)

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి సన్నిధి వీధిలోని శ్రీవేదాంత దేశికుల వారి ఆలయ మిరాశీదారుడు కళత్తూరు వాసుదేవాచార్య బుధవారం సాయంత్రం స్విమ్స్ ఆస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. బీకాం, బీఎల్ పట్టా పొందిన ఈయన ఆంధ్ర బ్యాంకులో ఉద్యోగ విరమణ పొందారు. టీటీడీ ఆలయ సంప్రదాయ ఆచార వ్యవహారాలు క్షుణ్ణంగా తెలిసిన ఈయన సుమారు 25 ఏళ్ల శ్రీదేశికులవారి సన్నిధిలో కైంకర్యం చేసి, తరించారు. ఇందుకోసం ఆయన వివాహం కూడా చేసుకోకుండా తన జీవితాన్ని త్యాగం చేశారు. రోజు ఉదయం, సాయంత్రం కట్టెల పొయ్యిలోనే ప్రసాదాలు తయారు చేసి, ఆచార్యునికి నైవేద్యం సమర్పించి ఆరాధన చేసేవారు. ఈయన మరణం శ్రీవైష్ణవ సంప్రదాయానికి తీరని లోటు అని స్థానిక అర్చకులు, జీయంగార్లు, ఆచార్య పురుషులు తెలిపారు. ఆయనకు ఇద్దరు అన్నలు, ఐదుగురు అక్కా చెల్లెళ్లు ఉన్నారు. గురువారం ఉదయం గంగుండ్ర మండపం వీధిలోని ఆయన స్వగృహంలో భౌతిక కాయం ఉంచి, అటు పిమ్మట అక్కారాంపల్లి మార్గంలోని హరిశ్చంద్ర శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించనున్నట్లు ఆయన బంధుమిత్రులు తెలిపారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

తిరుపతి అర్బన్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వ్యాపారాభివృద్ధికి కృషి చేద్దామని జిల్లా సహకార అధికారి ఎస్. లక్ష్మి తెలిపారు. బుధవారం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో నాబార్డ్ సౌజన్యంతో 13వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ మద్దిపట్ల వెంకటరమణ మాట్లాడుతూ సేవా సంఘాలుగా పనిచేయడంతోపాటు వ్యాపార సంఘాలుగా మారి గ్రామీణ రైతులను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా భారతీయ సహకార నిర్వహణ సంస్థ(ఐసీఎం)అధ్యాపకులు శ్యామ్‌కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగభూషణం, పెంచలయ్య, తిరుపతి డివిజన్ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వహణాధికారులు పాల్గొన్నారు.

ఉవ్వెత్తున ఎగసి పడుతున్న కెరటాలు


తూపిలిపాళెం సముద్రతీరంలో ఎగసి పడుతున్న అలలు

వాకాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తీరప్రాంత మండలాలైన వాకాడు, కోట, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. తూపిలిపాళెం సముద్రతీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. సముద్రం 5 మీటర్ల నుంచి ఏడు మీటర్లు ముందుకు జరిగి వచ్చింది. మత్స్యకారులు వేట నిలిపివేసి, వేట సామగ్రిని ఒడ్డుకు చేర్చారు. అధికారులు తీరప్రాంత గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. వేటకు వెళ్లిన మత్స్యకారులను వెనక్కి రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. గత రెండు నెలలు నుంచి విపత్తుల కారణంగా వేట సాగక జీవనం కోల్పోతున్నామని మత్స్యకారులు వాపోయారు.

ఊరందూరు జెడ్పీ పాఠశాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ శామ్యూల్

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ కడప ఆర్జేడీ శామ్యూల్ గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న సమ్మేటివ్–1 పరీక్షలను పరిశీలించి, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారిని అభినందించారు. అన్ని రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో ఇటీవల ఏర్పాటు చేసిన పాఠశాల రాజ్యాంగాన్ని పరిశీలించి, ప్రశంసించారు. ఉన్నత పాఠశాలలో ప్రతి కార్యక్రమాన్ని చక్కగా నిర్వహిస్తున్నట్లు కితాబిచ్చారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు మల్లికార్జున, రమేష్ బాబు, రజియా, మురళి, శాంతి పాల్గొన్నారు.